స్వామివారి ఎదుర్కోలు మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఎదుర్కోలు మహోత్సవం

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : పట్టణంలోని రాయగిరిలో గల వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా రాయగిరి స్టేషన్ సమీపంలోని ఆలయం వద్దకు తీసుకెళ్లారు.

భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోవింద నామ సంకీర్తనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, మాజీ సర్పంచ్ కళ్లెం బాలనర్సింహ, మాజీ ఎంపీటీసీ హనుమంతు నాయక్, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరం

- బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

సమావేశంలో మాట్లాడుతున్న బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, ఫిబ్రవరి 23 : సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ స్పేస్‌పై అవగాహన అవసరమని బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. మండలంలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో డిజిటల్ వర్క్ స్పేస్ వ్యూహాలపై సిబ్బందికి సైబర్ సెక్యూరిటీ సీఎంఈని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న డిజిటల్ వర్క్ స్పేస్‌లో సైబర్ ముప్పులకు వ్యతిరేకంగా అవగాహనను పెంపొందించేందుకు ఈ-ఆఫీస్, కొల్లాబ్ ఫైల్‌తో డిజిటల్ వర్క్ స్పేస్ కోసం సైబర్ సెక్యూరిటీ స్ట్రాటజీస్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులు, ఐటీ నిపుణుల కోసం మెడికల్ డొమైన్‌లో డిజిటల్ వర్క్ స్పేస్‌ను సురక్షితం చేయడం కోసం ఆలోచనలు, వ్యూహాలను మార్పిడి చేసుకోవడానికి ఒక వేదికను అందిస్తున్నదని తెలిపారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎన్ఐసీ సైంటిస్టులు డాక్టర్ పి.గాయత్రి, రేనిల్ జాన్, బి.సీతామహాలక్ష్మి కొల్లాబ్ ఫైల్స్, పీడీఎఫ్ టూల్స్, ఈ- ఆఫీస్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు అభిషేక్ అరోరా, అశోక్ నితిన్ జాన్, బిపిన్ పి.వర్గీస్, అధ్యాపకులు, పరిపాలన సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజాపేట గ్రామపంచాయతీ రికార్డుల పరిశీలన

రాజాపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

రాజాపేట, ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులను పరిశీలించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూసుకోవాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం చిన్నమేడారం వన దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ దినకర్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత

గీత కార్మికుడు రవీందర్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న బీసీ సంక్షేమశాఖ అధికారి యాదయ్య

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 23 : మండలంలోని తుక్కాపురంలో పొన్నగాని రవీందర్‌గౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారి పడి మృతి చెందాడు. టాడీ కార్పొరేషన్ నుంచి మంజూరైన రూ.25వేల చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు శుక్రవారం బీసీ కార్పొరేషన్ జిల్లా అధికారి యాదయ్య, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొలగాని జయరాములుగౌడ్ అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గడ్డం దశరథగౌడ్, పరకాల అంజయ్య, సోమయ్య, మల్లేశ్, వెంకటేశ్, దేవేందర్, నాగరాజు పాల్గొన్నారు.

భూమి రిజిస్ట్రేషన్ ఆపాలని మహిళ ఆత్మహత్యాయత్నం

- తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకున్న మహిళ .. అడ్డుకున్న స్థానికులు

తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నిస్తున్న సుమలత

గుండాల, ఫిబ్రవరి 23 : మండలంలోని కొమ్మాయిపల్లి గ్రామానికి చెందిన సంగి సుమలత శుక్రవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. బాధితురాలు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్మాయిపల్లి గ్రామానికి చెందిన కాడబోయిన వెంకటయ్యకు ముగ్గురు కుమార్తెలు. వెంకటయ్య తనకున్న భూమిలో పెద్ద కూమార్తె కాడబోయిన సోమక్క పేరున 4 ఎకరాల 8 గుంటల భూమి, మూడో కూమార్తె సంగి రామక్కకు 7ఎకరాల భూమి పట్టా చేశాడు. రెండో కూమార్తె లచ్చమ్మకు పెళ్లి చేసి పంపారు. కానీ.. భూమి పట్టా చేయలేదు. కాగా, సోమక్క తన భర్తను వదిలేసి తన చెల్లెలు అయిన రామక్క కుమారుడు సంగి స్వామి, కోడలు సుమలత వద్ద ఉంటూ జీవనం సాగిస్తుంది. ఇటీవల లచ్చమ్మ కూతురు వల్లాల పద్మ, మనుమరాలు అశ్విని కలిసి సోమక్కను తమ ఇంటికి తీసుకెళ్లి బాగోగులు చూస్తున్నారు. ఈ క్రమంలో సోమక్క పేరున ఉన్న 4.8ఎకరాల భూమిని హైదరాబాద్‌కు చెందిన లక్కాకుల కర్ణాకర్‌కు విక్రయించారు. ఆయనకు భూమిని పట్టా చేసేందుకు శుక్రవారం వల్లాల పద్మ, ఆమె కుమార్తె అశ్విని సోమక్కను తాసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న సంగి సుమలత, ఆమె భర్త స్వామి తాసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆ భూమిలో తమకు వాటా ఉన్నదని, తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమికి పట్టా చేయడం ఆపాలని తాసీల్దార్ జలకుమారిని కోరారు. అనంతరం వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను సుమలత ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే అక్కడున్న వారు అడ్డుకున్నారు. ఈ విషయమై తాసీల్దార్ జలకుమారిని వివరణ అడుగగా.. కాడబోయిన సోమక్క పేరున ఉన్న 4.8ఎకరాల భూమిని లక్కాకుల కార్ణాకర్ పేరున రిజిస్ట్రేషన్ చేసేందుకు కార్యాలయానికి వచ్చారని తెలిపారు. అదే సమయంలో సంగి సుమలత పట్టా చేయడం ఆపాలని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్నదని అన్నారు. ఆ భూమి సోమక్కకు వారసత్వం నుంచి వచ్చినందున పట్టా చేయకుండా నిలిపివేశామని, తదుపరి విచారణ అనంతరం ఎవరికి సక్రమంగా ఉంటే వారికి రిజిస్ట్రేషన్ చేస్తామని తాసీల్దార్ చెప్పారు.

బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయ నూతన కమిటీ

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 23 : పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుడికాల భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా చిక్క అశోక్, ప్రధాన కార్యదర్శిగా పొట్టబత్తిని ధనుంజయ, కోశాధికారిగా బోగ శ్రీరాములు, సహాయ కార్యదర్శిగా ఆడెపు భావనారుషి, ధర్మకర్తలుగా ఇస్తారి, జానకిరాములు, కృష్ణ, నర్సమ్మ, లక్ష్మి, శేఖర్ ఎన్నికయ్యారు.

శాస్త్రోక్తంగా లక్ష్మీనృసింహస్వామి నిత్యారాధనలు

అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 23 : యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామివారి నిత్యారాధనలు శాస్త్రోక్తంగా సాగాయి. శుక్రవారం తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నారసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం వేళ స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. రాత్రివేళ స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 11వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.18,50,451 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

గృహ హింస నిర్మూలనకు కృషి చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రమీల

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 23 : సమాజంలో మహిళలపై హింసను తగ్గించడానికి ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా మెలగాలని సార్ప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ప్రమీల అన్నారు. పట్టణంలోని స్త్రీ శక్తి భవనంలో సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గృహ హింసపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల కార్మికులు, లింగ నిష్పత్తి, బాల్య వివాహాలు, ట్రాఫికింగ్ అంశాలపై వివరించారు. గ్రామాల్లో కమిటీల ద్వారా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించుకోవాలని, పెద్ద సమస్యలు వచ్చినప్పుడు ప్రభుత్వ అధికారుల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేస్తున్న శిక్షణతో నైపుణ్యం పొంది ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. ఉమ్మడి కుటుంబాలు లేకపోవడం వల్ల గృహ హింస కేసులు ఎక్కువ నమోదు అవుతున్నాయని తెలిపారు. గృహ హింసకు సంబంధించిన కేసులను సఖి టోల్ ఫ్రీ నెంబర్ 181కి తెలపాలని సూచించారు. పిల్లలకు సంబంధించిన సమస్యలు ఉంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, ఎంపీఓ మాజిద్, డీసీపీఓ సైదులు, సఖి అడ్మినిస్ట్రేటర్ లావణ్య, సార్ప్ సంస్థ సిబ్బంది, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

ఆత్మకూరు (ఎం), ఫిబ్రవరి 23 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తివందన్ అభియాన్‌తో మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని భువనగిరి పార్లమెంట్ శక్తివందన్ అభియాన్ ఇన్‌చార్జి ప్రియదర్శిని అన్నారు. మండలంలోని పల్లెర్ల గ్రామంలో శుక్రవారం మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రచార కరపత్రాలను అందజేశారు. మహిళా సంక్షేమం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను మహిళలందరికీ వివరించాలన్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాధురి, పద్మ, మంజుల, ధనలక్ష్మి, పుష్పమ్మ, లక్ష్మి, మంగమ్మ పాల్గొన్నారు.

జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి పని కల్పించాలి

ఉపాధి హామీ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు డీఆర్డీఓ సురేశ్

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 23 : ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని అదనపు డీఆర్డీఓ సురేశ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధి హామీ పనుల మస్టర్లు, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ నిరంజన్ వలీ, ఏపీఓ రమేశ్, ఈసీ శ్రీనివాస్, టీఏలు నిర్మల, యాదిరెడ్డి, శ్రీశైలం, మల్లేశ్, కంప్యూటర్ ఆపరేటర్లు శ్రావణ్‌కుమార్, మాజీద్ ఉన్నారు.

దాతారుపల్లిలో అనుమానిత మహిళా గ్యాంగ్

- గ్రామస్తుల ఫిర్యాదుతో అదుపులోకి తీసుకున్న పోలీసులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 23 : వడ్డీకి డబ్బులిస్తామని ఐదుగురు సభ్యులు గల మహిళా గ్యాంగ్ మండలంలోని దాతారుపల్లి శుక్రవారం సంచరించింది. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో గ్రామస్తులు వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. శుక్రవారం ఉదయమే యాదగిరిగుట్టకు చేరుకున్న ఐదుగురు మహిళలు దాతారుపల్లి గ్రామానికి వెళ్లారు. మొదట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేసే ఉపేందర్ వద్దకు వెళ్లి తాగడానికి నీళ్లు ఇవ్వాలని కోరారు. అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు రాజును ఆపి తమ చేతిలో డబ్బులు లేవు.. సాయం చేయాలని కోరగా ఆయన నిరాకరించాడు. అనంతరం గ్రామంలోని లేడీస్ టైలర్ షాపు వద్దకు వెళ్లి సొంత ఇల్లు చూపిస్తే వడ్డీకి డబ్బులు ఇస్తామని, మహిళా సంఘాలకు రుణాలు ఇస్తామని చెప్పడంతో పాటు అనుమానంగా ప్రవర్తించారు. అయితే.. ఈ మధ్య చిన్నారులను కిడ్నాప్ చేసే మహిళా గ్యాంగ్ గ్రామాల్లో తిరుగుతున్నదని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్న క్రమంలో గ్రామస్తులు వారిని వారించారు. మీరు ఎక్కడి నుంచి వచ్చారు.. మాకు మీరేందుకు వడ్డీకి డబ్బులివ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. మా గ్రామం నుంచి వెళ్లిపోండని చెప్పారు. దీంతో ఆ మహిళలు గ్రామస్తులతో వాగ్వాదానికి దిగగా.. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రమేశ్, ఎస్ఐ ఉదయ్, పోలీస్ సిబ్బందితో వచ్చి వారిని విచారించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన కండెల జ్యోతి, జగన్నాథం నాగమ్మ, పోలె యశోద, జగన్నాథం జ్యోతి, జగన్నాథం నాగమ్మగా గుర్తించామని సీఐ రమేశ్ తెలిపారు. తక్కువ మొత్తంలో డబ్బులను అధిక వడ్డీకి ఇచ్చేవారుగా గుర్తించినట్లు చెప్పారు. వారిని తాసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

పంట పొలాల పరిశీలన

శారాజీపేటలో పొలాలను పరిశీలిస్తున్న డీఏఓ అనూరాధ

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 23 : మండలంలోని శారాజీపేటలో పంట పొలాలను జిల్లా వ్యవసాధికారి అనూరాధ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. యాసంగిలో నారుమడిని కాండం తొలిచే పురుగు ఆశించి పంటలను నష్టపరుస్తుందన్నారు. రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని కాపాడుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఓ దీప్తి, ఏఈఓ నాగార్జున, రైతులు ఉన్నారు.

పాటిమట్లలో క్రీడా పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

మోత్కూరు, ఫిబ్రవరి 23 : మండలంలోని పాటిమట్ల గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలను బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గిరగాని శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమలో మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థ వ్యవస్థాపకుడు కురిమేటి నవీన్, నాయకులు సాయికుమార్, యాదయ్య, భిక్షం, సైదులు పాల్గొన్నారు.

మత్స్యాద్రికి సామగ్రి సప్లయ్ టెండర్లకు ఆహ్వానం

వలిగొండ, ఫిబ్రవరి 23 : మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వేములకొండ గుట్టపై కిరాణా సామగ్రిని సప్లయ్ చేయడానికి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు దేవస్థానం ఈఓ సల్వాద్రి మోహన్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానానికి పులిహోర కవర్లు, కరెంట్ సామగ్రి, బ్లీచింగ్, ఫినాయిల్, సున్నం, యాసిడ్, కొబ్బరి, పొరకలు.. పండుగలు, బ్రహ్మోత్సవాలకు పూలు పండ్లు, పూలతో ఆలయ అలంకరణ తదితర అంశాలకు సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. టెండర్ దక్కించుకున్నవారు ఈ ఏడాది ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి 3వరకు సామగ్రి సప్లై చేయాల్సి ఉంటుందని తెలిపారు. సీల్డ్ టెండర్లను మార్చి 1న మధ్యాహ్నం 12గంటల్లోపు టెండర్ బాక్స్‌లో వేయాలని ఔత్సాహికులకు సూచించారు. పూర్తి సమాచారం కోసం దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

అవమానపరిచిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

- ఎంపీటీసీ లలిత

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : స్థానిక ప్రజాప్రతినిధిని అయిన తనకు కనీస సమాచారం అందించకుండా సీసీ రోడ్డు పనులు చేపట్టిన గ్రామ ప్రత్యేకాధికారులు, సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాలని వీరవెల్లి ఎంపీటీసీ కంచి లలిత శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వీరవెల్లి ఎంపీటీసీ పరిధిలోని చీమలకొండూరు గ్రామంలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారని, స్థానిక ఎంపీటీసీగా ఉన్న తనకు సమాచారం ఇవ్వకుండా అవమానపరిచారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : భారతీయ భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ కనుగొన్న రామన్ ప్రభావం (రామన్ ఎఫెక్ట్)కు గుర్తుగా జరుపుకొనే జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో సైన్స్ కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓ కె.నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాలల్లో సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, సైన్స్ పట్ల ఆసక్తి పెంచే కార్యక్రమాలు జరుపాలని సూచించారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, సైన్స్ సెమినార్, చిత్రలేఖనం, సైన్స్ పుస్తక ప్రదర్శన, సైన్స్ పరికరాల ప్రదర్శన, ప్రయోగ ప్రదర్శనలు, బోధన అభ్యాసన సామగ్రి తయారీ, సైన్స్ ప్రాజెక్టులు, శాస్త్రవేత్తలపై ఉపన్యాసం, విజ్ఞాన మేళా వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి భరణికుమార్ 9000989726 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిపై పోక్సో కేసు

వలిగొండ, ఫిబ్రవరి 23 : బాలికను కిడ్నాప్ చేసిన నిందితుడిని అదుపులోకి తీసుకొని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని అరూరు గ్రామానికి చెందిన బండారు రాజు బాలికను కిడ్నాప్ చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తప్పించుకు తిరుగుతున్న రాజును జనగాం జిల్లాలోని ఎర్రగొల్లపాడు గ్రామంలో పోలీసులు అరెస్టు చేసి చౌటుప్పల్ కోర్టులో శుక్రవారం హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మోత్కూరు, ఫిబ్రవరి 23 : మండలంలోని ధర్మారం గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన 24 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే మందుల సామేల్ చెక్కులు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో తాసీల్దార్ రాంప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంగా చదువాలి : డీఈఓ నారాయణరెడ్డి

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ నారాయణరెడ్డి

రామన్నపేట, ఫిబ్రవరి 23 : విద్యార్థులు కష్టం అనుకోకుండా ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదుగాలని డీఈఓ కె.నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని మునిపంపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలోని పాఠశాలలను సందర్శించి రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అశ్వినీకుమార్, ప్రధానోపాధ్యాయుడు రహ్మత్‌ఖాన్, హెచ్ఈఓ గోపాల్, సూపర్‌వైజర్లు వాణిశ్రీ, మల్లేశం, ఏఎన్ఎం మంజుల, గౌసియా, కవిత పాల్గొన్నారు.

మహమ్మాయి గుడిలో ధ్వజారోహణం

మహమ్మాయి దేవాలయంలో ధ్వజ స్తంభం వద్ద పూజలు చేస్తున్న పురోహితులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 23 : పట్టణంలోని మహమ్మాయి దేవి కల్యాణ రథోత్సవంలో భాగంగా శుక్రవారం ఆలయంలో గణపతి పూజ, ధ్వజారోహణం, స్వస్తీవాచనం, అంకురార్పణం, నైవేద్య నివేదన పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చేపూరి రామ్మోహనాచారి, కోశాధికారి నందిగామ కిష్టయ్య, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కృష్ణమాచారి, రాఘవేంద్రాచారి, స్వామి, ఆనంద్‌చారి, ప్రభాకరాచారి, రామకృష్ణ, రవి, మహేశ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి

భువనగిరి సిటీ, ఫిబ్రవరి 23 : పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో శుక్రవారం జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ డీఏను విడుదల చేయాలని, మెడికల్ అలవెన్స్, దహన సంస్కార ఖర్చులకు డబ్బులు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖల ఆనందం, నాయకులు టి.కృష్ణయ్య, సీహెచ్ మల్లయ్య, ఆంజనేయ పంతులు, ఆదిరెడ్డి లక్ష్మిరెడ్డి, రాంరెడ్డి, సత్తయ్య, ఆగయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు జెర్సీలు అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పింగళ్‌రెడ్డి

క్రీడాకారులను ప్రోత్సహించాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పింగళ్‌రెడ్డి

బీబీనగర్, ఫిబ్రవరి 23 : క్రీడాకారులు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అందుకునేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి పింగళ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన కబడ్డీ క్రీడాకారులకు పింగళన్న సేవాదల్ ఆధ్వర్యంలో శుక్రవారం జెర్సీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీలో రాణిస్తూ మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధిస్తున్న యువకులు మున్ముందు మరిన్ని సాధించేలా తోడ్పాటు నందిస్తానన్నారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అక్బర్, నాయకులు దస్తగిరి, రవీందర్, ప్రవీణ్‌రెడ్డి, నరేందర్, ప్రశాంత్‌రెడ్డి, రాజశేఖర్, జానీ, శేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లకు కుర్చీల అందజేత

అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలను అందజేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి

భువనగిరి సిటీ, ఫిబ్రవరి 23 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలు కూర్చునేందుకు రోటరీ క్లబ్ భువనగిరి ఆధ్వర్యంలో శుక్రవారం కుర్చీలు అందజేశారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని సెంటర్‌కు 10, తాతానగర్ కేంద్రానికి 20 కుర్చీలను క్లబ్ అధ్యక్షుడు పడమటి జగన్మోహన్‌రెడ్డి సహకారంతో అందించారు. కార్యక్రమంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ చిన్న లక్ష్మణ్, కోశాధికారి వేమూరి అశోక్‌కుమార్, మాజీ అధ్యక్షులు మంచికంటి వెంకటేశం, దేవేందర్‌చారి, కిషన్, జి.హరి, రవీందర్, వేణుమాధవ్, మల్లారెడ్డి, మధు, అంగన్‌వాడీ టీచర్లు నవత, బాలమణి, అరుణ పాల్గొన్నారు.

'రైతు మృతికి బీజేపీ ప్రభుత్వం బాధ్యత వహించాలి'

రామన్నపేట, ఫిబ్రవరి 23 : ఢిల్లీలో రైతు మృతికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, విద్యుత్ సవరణ చట్టం ఉపసంహరించుకోవాలని ఢిల్లీ సరిహద్దులో ప్రజాస్వామ్యయుతంగా ఉద్యమిస్తున్న రైతులపై మోదీ ప్రభుత్వం పైశాచిక దాడులను మానుకోవాలని పేర్కొన్నారు. పంజాబ్ సరిహద్దుల్లో యువ రైతు శంకరన్ సింఘ్‌పై పోలీసులు కాల్పులు జరిపి హతమార్చడం పాశవిక చర్య అని ఖండించారు. రైతు మృతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.